క్లుప్తంగా

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధి కుమ్మరిపాలెంలోని డాక్టర్ కేఎల్ రావు హెడ్‌వాటర్ వర్క్స్‌లో 16 ఎంఎల్‌డీ(పాతది), 5 ఎంజీడీ పంపింగ్‌లైన్ మరమ్మతులను బుధవారం రాత్రి నుంచి చేయనుండటంతో గురువారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని మల్లికార్జునపేట, శ్రీనగర్‌కాలనీ, లబ్బీపేట, గవర్నర్‌పేట, రెహమాన్‌పార్కు, గులామొహిద్దీన్‌నగర్, గుప్తా కల్యాణ మండపం, కుమ్మరిపాలెం ఏరియా, నిమ్మతోట, శ్రీనివాస్‌మహల్, ఫిష్‌మార్కెట్, గాంధీ బావి, అంబేడ్కర్ నగర్, గాంధీజీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, కొట్టేటి కోటయ్య వీధి, నైజాం గేటు ప్రాంతాల్లో ఈ నెల 8వ తేదీ నీటి సరఫరా జరగదని మరమ్మతులు పూర్తైన వెంటనే పునరుద్ధరిస్తామని ఆయన వివరించారు. ఆయా ప్రాంతవాసులు ముందుగానే నీటి నిల్వలు చేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

26 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 26 మందిపై 5వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. 26 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 8 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు.

ప్రమాదకర కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించండి

వీఎంసీ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించాలని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు నగర సుందరీకరణలో భాగంగా ఆయన మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో కేబుల్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ అవసరం లేని, వినియోగంలో లేని వైర్లను క్రమబద్ధీకరించి వారం రోజుల్లోగా తొలగించాలన్నారు. నిబంధనలను అమలు చేయకపోతే వారం తర్వాత వీఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు, కేబుల్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన భవానీపురం పిండాల ఘాట్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా మంగళగిరి ఎర్రబాలెంకు చెందిన పిల్లా లక్ష్మి(62) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. గతేడాది ఆగస్టులో ఆపరేషన్ చేసి కడుపులో గడ్డ తొలగించారు. అయినా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. ఆమెకు కీమో థెరపీ చేస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో కుమారుడు పిల్లా త్రినాథ్ రిపోర్టుల కోసం ఆసుపత్రికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఆమె ఇంట్లో లేదు. చుట్టుపక్కల వారిని, బంధువుల వద్ద వెదికినా ఆమె ఆచూకీ తెలియలేదు. మంగళవారం రాత్రి కృష్ణానదిలో భవానీపురం పిండాల ఘాట్ వద్ద మహిళ మృతదేహం లభ్యమైంది. దీంతో అక్కడికి వెళ్లి చూసిన త్రినాథ్ మృతదేహం తన తల్లి లక్ష్మీదేనని నిర్ధారించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చనిపోవాలనే ఉద్దేశంతో కృష్ణానదిలో దూకి ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీకే రెడ్డి రోడ్డులో ఆక్రమణలు..

- వాహనాల అడ్డగోలు పార్కింగ్
- చిరువ్యాపారుల హడావుడి
- తరచూ నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్యపై దృష్టిసారించని అధికారులు



కేదారేశ్వరపేట రైతుబజార్ ఎదుట రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): సీకే రెడ్డి రోడ్డు ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. కేదారేశ్వరపేట రైతుబజార్ వద్ద అడ్డగోలుగా వాహనాల పార్కింగ్, రోడ్లపై బండ్లు పెట్టి చిరువ్యాపారులు హడావుడి చేస్తుండటంతో తరచూ వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రధానంగా ప్రభాస్ కాలేజీ నుంచి మీసాల రాజారావు బ్రిడ్జి వరకు ఉన్న సీకే రెడ్డి రోడ్డు ఆక్రమణలతో పూర్తిగా నిండిపోయింది. అడుగడుగునా బడ్డీకొట్లు వెలిశాయి. ఆపై రైతుబజార్‌కు వచ్చే ప్రజలు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో 40 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డు 10 అడుగులకు చిక్కిపోయింది. ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రహదారి ఉదయం, సాయంత్రం నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో ఆక్రమణల కారణంగా ఉద్యోగులు, వివిధ పనులకు వెళ్లేవారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అడుగడుగునా తోపుడు బండ్లు

అధికార పార్టీకి చెందిన స్థానిక చోటామోటా నాయకులు అండదండలతో కొందరు చిరువ్యాపారులు రోడ్డును రెండు వైపులా ఆక్రమించుకుని తోపుడు బండ్లు, బడ్డీకొట్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటి వద్దకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

రైతుబజార్ వద్ద వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని సైతం హాకర్లు ఆక్రమించి తోపుడు బండ్లు నిలుపుతున్నారు. రైతు బజార్‌కు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి.

రైతుబజార్‌కు దారేది

కేదారేశ్వరపేట రైతుబజార్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆక్రమణల కారణంగా లోపలికి వెళ్లడానికి దారి ఉండటం లేదు. రైతుబజారు బయట ప్రాంతాన్ని హాకర్లు తోపుడు బండ్లతో ఆక్రమిస్తున్నారు. రైతుబజార్ చుట్టు పక్కల ప్రాంతాలనే కాకుండా లోపలికి వెళ్లే ద్వారాలను కూడా ఆక్రమిస్తున్నారు. కొనుగోలుదారుల్లో కొందరు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఫలితంగా రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులు లోపలికి వెళ్లేందుకు, కూరగాయలు కొని బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు

ఆక్రమణలతో రైతుబజార్ వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. రైతు బజార్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సైతం ఆక్రమణలు, వాహనాల అడ్డగోలు పార్కింగ్‌లపై చర్యలు తీసుకోడంలేదని స్థానికులు, ఈ రోడ్డులో ప్రయాణించే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం



సీకే రెడ్డి రోడ్డు మొత్తం ఆక్రమణలతో నిండిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంతో సమానం. రోడ్డును హాకర్లు, బడ్డీకొట్ల నిర్వాహకులు పూర్తిగా ఆక్రమించేస్తున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుని సతమతమవుతున్నాం.

– అశోక్, వాహనచోదకుడు

ఆధ్యాత్మికతే సమాజానికి శాంతి మార్గం



విజయవాడ కల్చరల్: ఆధ్యాత్మికతే సమాజానికి శాంతి మార్గమని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్ అన్నారు. నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. భారతీయ సనాతన ధర్మం విశిష్టమైనదని తెలిపారు. దేశ భవిష్యత్ దానిమీద ఆధారపడి ఉందని పేర్కొన్నారు. భారతీయులకు అనంతమైన ఆధ్యాత్మిక సంపద ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ధర్మోరక్షతి సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాళ్ళాయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి, ధర్మోరక్షిత రక్షత సభ్యులు హరివెంట సతీష్, మారిశెట్టి మదన్మోహన్, విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి రాఘవులు పాల్గొన్నారు. నిర్వాహకులు అలోక్ కుమార్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



నూతన ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దుర్గాప్రసాద్ స్వామి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని శ్రీహనుమత్ దీక్షా పీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి పేర్కొన్నారు. కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమ ఏర్పాట్లను దుర్గాప్రసాద్ స్వామి మంగళవారం పరిశీలించారు. తొలుత ఆలయానికి చేరుకున్న దుర్గాప్రసాద్ స్వామిని ఈవో సీతారామయ్య, ధ్వజస్తంభ దాత పోతిన వెంకట మహేష్ దంపతులు, ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న దుర్గాప్రసాద్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, పరాశరం పవన్‌కుమార్ ఆచార్యులు కార్యక్రమాలను వివరించారు. 9వ తేదీ ఉదయం 6.51 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు, బాయన శేఖర్‌బాబు, రాంపిళ్ల వాసు, చిట్టినగర్ వేంకటేశ్వరస్వామి అర్చకుడు రామరత్నమాచార్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

అనాధికారిక వెండర్స్ నుంచి రూ.4.65 లక్షలు జరిమానా

సాక్షి ఎఫెక్ట్



రైల్వేస్టేషన్‌లో విజిలెన్స్, ఆర్‌పీఎఫ్ అదుపులోకి తీసుకున్న అనధికారిక విక్రేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనాధికారిక విక్రయాలు సాగిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేయడంతో పాటు నాసిరకం ఆహార విక్రయాలతో వారి ఆరోగ్యాలతో ఆడుకుంటున్న నకిలీ వెండర్స్‌పై ఇటీవల 'రైల్వే స్టేషన్‌లో నకిలీ వెండర్స్ దందా' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి విజిలెన్స్, ఆర్‌పీఎఫ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం సాయంత్రం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎటువంటి ఐడీ కార్డులు, వెండింగ్ పర్మిట్‌లు లేకుండా విక్రయిస్తున్న సుమారు వంద మంది అనాధికార వెండర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేసిన అనంతరం వారి నుంచి రూ.4,65,000 పెనాల్టీ విధించారు. రైల్వేస్టేషన్‌లో అనధికారిక వాణిజ్య కార్యకలాపాలను నివారించే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విక్రేతల గుర్తింపు కార్డులు, వెండింగ్ పర్మిట్‌లతో సహా విక్రేతల ఆధారాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. లైసెన్స్ పొందిన స్టాల్ నిర్వాహకుల కింద అనుమతులు లేకుండా పనిచేస్తున్న విక్రేతలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. వీటితో పాటు రైల్వే చట్టంలోని సంబంధిత నిబంధనల కింద ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.

నేత్రపర్వంగా పాండురంగడి పుష్పయాగం



పుష్పయాగంలో పాండురంగడి ఉత్సవమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారి పుష్పయాగం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగడి ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి వారి నామాలను పఠిస్తూ, కీర్తనలు ఆలపిస్తూ పుష్పయాగం చేశారు. సుమారు రెండు గంటల పాటు భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాలు, అర్చకస్వాములు మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి పుష్పయాగం రమణీయంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో నగర క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల ఐదో తేదీన బిహార్‌లోని గయలో ప్రారంభమైన పోటీల్లో నగరానికి చెందిన తీర్థసామ్ దేవ్, సంపత్ కుమార్ యాదవ్ మూడు పతకాలను కైవసం చేసుకున్నారు. ఐదో తేదీన సంపత్ కుమార్ యాదవ్ 200 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఆరో తేదీ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సంపత్ కుమార్ యాదవ్ గోల్డ్, తీర్థ సామ్ దేవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో నగర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, మోహన్ వెంకట్ రామ్ అభినందించారు.

భారీ స్కామ్ 'యాక్సిస్' పవర్

- మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఆసిఫ్
- పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైఎస్సార్ సీపీ నిరసన



విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



విద్యుత్ శాఖ అధికారితో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి, రుహుల్లా, ఆసిఫ్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యాక్సిస్ సంస్థతో తాజాగా చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం విద్యుత్‌రంగ చరిత్రలోనే భారీ స్కామ్ అని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు యూనిట్ రూ.2.49కి కొంటే గగ్గోలు పెట్టిన చంద్రబాబు నేడు యూనిట్ రూ.4.60కి ఎలా కొన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సూచన మేరకు 47వ డివిజన్ కేఎల్‌రావునగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం కూటమి ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ విద్యుత్ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ చార్జీలపై బాదుడే..బాదుడు అని దుష్ప్రచారం చేసిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూడటమే కాకుండా అవసరమైతే తగ్గిస్తామని ప్రగల్భాలు పలికారని మండిపడ్డారు. కరెంట్ చార్జీలే కాకుండా నిత్యావసర సరుకుల ధరలు పెంచేశారని, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు దాని ధరకూడా పెంచేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని ప్రచారం చేసి ఒక్క హామీకూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలపై అధికభారం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై అధిక భారం మోపిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు అమరావతిని తెర మీదకు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

దోచుకోవడం..దాచుకోవడం చంద్రబాబుకు అలవాటే

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సోలార్, విండ్ ఎనర్జీ రేట్లు తగ్గుతుంటే చంద్రబాబు ప్రభుత్వం యాక్సిస్ నుంచి యూనిట్ విద్యుత్ రూ.4.60కి కొనుగోలు చేయడం దోచుకోవడం, దాచుకోవడం చంద్రబాబుకు ఆది నుంచి అలవాటేనని ఎద్దేవా చేశారు. యాక్సిస్ సంస్థతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోదావరి గంగ, బాపతి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గౌస్‌మొహిద్దీన్, దేరంగుల రమణ, కర్నాటి రాంబాబు, గోదావరి బాబు, కామశ్ల జోజి, కూరాకుల నాగ, తంగెళ్ల రాము, తోలేటి శ్రీకాంత్, బూదాల శ్రీను, పిల్లా సూరిబాబు, అయితా కృష్ణకిషోర్, వల్లం రవి, మజ్జి శ్రీను, శీరం వెంకట్రావు, నస్నం దుర్గ, నరేంద్ర సింగ్, గురుమంత మహేష్, నక్కా ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయండి

- 20న దేశవ్యాప్త సమ్మె
- డీపీఓకు సమ్మె నోటీస్‌ను అందజేసిన సీఐటీయూ



డీపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న నేతలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, 132, 142, 680 జీఓలు, టెండర్లపై హైకోర్ట్ తీర్పు అమలు చేయాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 20న తలపెట్టిన సమ్మె నోటీస్‌ను జిల్లా పంచాయతీ అధికారి కె.లావణ్య కుమారికి సీఐటీయూ నాయకులు అందజేశారు. గొల్లపూడిలోని డీపీఓ కార్యాలయానికి మంగళవారం వెళ్లిన సీఐటీయూ నాయకులు ఆమెను కలిసి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేత సోమేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం - 1926, వర్క్‌మెన్ కాంపన్సేషన్ యాక్ట్-1923, వేతనాల చెల్లింపు చట్టం-1935తో పాటు కనీస వేతనాల చట్టం-1948, బోనస్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్చేసిందని వివరించారు. కోడ్స్ కారణంగా కార్మికులు హక్కులను కోల్పోవడం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నాయని పేర్కొన్నారు.

సమ్మెకు పిలుపు

ప్రమాదకరమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20వ తేదీన దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చాయని తెలియ చేశారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికులకు గత 8 ఏళ్లగా జీతాలు పెరగలేదని, మున్సిపల్ కార్మికులు నిర్వర్తిస్తున్న విధులనే పంచాయతీ కార్మికులుకూడా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ విజయవాడ రూరల్ కార్యదర్శి నరసింహారావు, పంచాయతీ యూనియన్ నాయకులు రామకోటయ్య, అశ్రునికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు

కొండచరియలకు ఐరన్ మెష్



మెష్ ఏర్పాటుచేస్తున్న కాంట్రాక్టర్ సిబ్బంది



దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేసిన దృశ్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డు పనులు, కొండ చరియలు విరిగి పడకుండా ఐరన్ మెష్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పనుల నేపథ్యంలో ఘాట్‌రోడ్డు మీదగా రాకపోకలను మూడు రోజుల పాటు దేవస్థానం నిలిపివేసింది. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్, పార్కింగ్ ఏరియాల మధ్య కొండ రాళ్లు విరిగిపడకుండా ఐరన్ మెష్ ఏర్పాటు పనులను చేపట్టారు. మరో వైపున ఘాట్‌రోడ్డు మూసివేయడంతో భక్తులు, యాత్రికులు ఇబ్బందులకు గురి కాకుండా దేవస్థానం సీతమ్మ వారి పాదాల వద్ద ప్రత్యేక హోల్డింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. బస్టాండ్, రైల్వేస్టేషన్లతో పాటు సొంత వాహనాలపై వచ్చే యాత్రికులను హోల్డింగ్ పాయింట్‌కు తరలించింది. అక్కడి నుంచి దేవస్థాన బస్సులు, ఆటోలపై కనకదుర్గనగర్ వరకు ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. మరో వైపున మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ.100, రూ.300, రూ. 500 టికెట్లను కొనుగోలు చేసి క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకున్నారు. మంగళవారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగానే కొనసాగింది.